క్లుప్తంగా

ఈనెల 8న మండల సర్వసభ్య సమావేశం

సిర్పూర్(టి): మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఈనెల 8న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రాజేశ్వర్ తెలిపారు. మండల సర్వసభ్య సమావేశానికి మండలంలోని వివిధ శాఖల అధికారులు తమ నివేదికలతో విధిగా హాజరు కావాలని, గౌరవ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తప్పక హాజరుకావాలని ఆయన కోరారు. ఉదయం 11 గంటల నుంచి సర్వసభ్య సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

'క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించండి'



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీకాంత

కెరమెరి: క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించాలని హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మీకాంత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా వర్కర్లకు నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. మండలంలో మొత్తం 34వేల జనాభా ఉందని, క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించడంలో వెనుకంజలో ఉన్నామన్నారు. వారం, పది రోజులపాటు దగ్గు తగ్గకుంటే తెమడ పరీక్షలు చేయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫార్మసిస్ట్ ఖలీల్ హుస్సేన్, ఎంపీహెచ్‌ఏ వసంత్, శంకర్ తదితరులు ఉన్నారు.

పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న అన్నపూర్ణ

కెరమెరి: మండలంలోని రాంగనగర్, కొఠారి, కల్లెగాం, రింగన్‌ఘాట్ ప్రాథమిక పాఠశాలల్లో చదువుకుంటున్న 70 మంది విద్యార్థులకు ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారి అన్నపూర్ణ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ప్రతీరోజు స్నానం చేయాలని, ఉతికిన బట్టలు ధరించాలని, చేతులు, కాళ్లకు గోర్లులేకుండా చూసుకోవాలని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయులు ఎస్.కిషన్, ఎం. దివ్యశ్రీ, జె.కిరణ్మయి ఉన్నారు.

'బహుజనుల పక్షాన పోరాడుతాం'



మాట్లాడుతున్న బీఎస్పీ నాయకులు

పెంచికల్‌పేట్: రానున్న రోజుల్లో నియోజకవర్గ బహుజనుల పక్షాన పోరాటం చేస్తామని బీఎస్పీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ ఆవరణలో మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో బీఎస్పీకి ఓటు వేసిన ప్రతీ ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసి బహుజన రాజ్యాధికారం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు దేవాజి, ఆశన్న, షరీఫ్, తిరుపతి, బాబాజి, హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించకుంటే చర్యలు



వివరాలు తెలుసుకుంటున్న ఆడే ప్రకాశ్

కెరమెరి: ఉపాధ్యాయులు సమయపాలన పాటించకుంటే చర్యలు తీసుకుంటామని మండల నోడల్ అధికారి ఆడే ప్రకాశ్ అన్నారు. మంగళవారం మండలంలోని సాంగ్వి, కెలికే పాఠశాలలను ఆయన సందర్శించారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. ప్రతీరోజు క్రమం తప్పకుండా ఎఫ్‌ఆర్‌ఎస్‌లో హాజరు వేయాలన్నారు. అల్పాహారం మెనూ ప్రకారం అందించాలని పేర్కొన్నారు. త్వరలో మండలానికి ఎఫ్‌ఎల్‌ఎన్ పరిశీలన రాష్ట్ర బృందం వస్తున్నట్లు తెలిపారు.

వీస్తున్న ఈదురుగాలులు

తిర్యాణి: బంగాళాఖాతంలో ఏర్పడ్డ మిచాంగ్ తుపాన్ ఎఫెక్ట్‌తో జిల్లాలో పలుచోట్ల చిరు జల్లులు కురుస్తున్నాయి. దీంతో పాటు బలమైనా ఈదురుగాలులు వీస్తుండటంతో చలి తీవ్రత ఒక్కసారిగా పెరిగింది. ఈదురుగాలులతో వృద్ధులు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

దిగుబడి దిగులు..!



కనికిలో సాగవుతున్న పత్తి పంట

- అనావృష్టితో పత్తి పంటకు తీవ్ర నష్టం
- పెరిగిన వ్యయం.. తగ్గిన దిగుబడి
- ఆందోళన చెందుతున్న రైతులు

కౌటాల: ఏటా అన్నదాతలపై ప్రకృతి కన్నెర్రజేస్తోంది. ప్రతీ ఏడాది పంటల సాగులో రైతులకు తిప్పలు తప్పడం లేదు. రెండేళ్లుగా పత్తి పంటకు వాతావరణం అనుకూలించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది సైతం పంట సాగు ఆరంభం నుంచే కష్టాలు మొదలయ్యాయి. ఈ ఖరీఫ్‌లో ఆశాజనకంగా వర్షాలు కురవకపోవడంతో పత్తి మొక్కలు ఏపుగా పెరగలేదు. పత్తి పంటకు సోకిన తెగుళ్లు, పురుగుతో ఈసారి పంట దిగుబడి చాలా తగ్గిందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఏటా నష్టాలే..

ఈసారి ఖరీఫ్‌లో జిల్లాలో 3.38 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి పంట సాగు చేశారు. తొలకరి వర్షాలతో పత్తి పంటను సాగు చేసిన రైతాంగానికి చివరికి నిరాశే మిగిలింది. తెల్లబంగారం పండిస్తే కష్టాలు దూరమవుతాయని భావించిన రైతులు అధికారుల అంచనా ప్రకారం పత్తి సాగు చేసినా సకాలంలో వర్షాలు కురవకపోవడంతో రైతులకు తీవ్ర నష్టం కలిగింది. వర్షాలు లేక పత్తి మొక్కలు ఏపుగా పెరగలేదు. దీంతో పత్తి మొక్కలకు ఆశించిన స్థాయిలో పత్తి కాయలు లేవు. దీంతో పత్తి పంటకు తీవ్ర నష్టం కలిగిందని రైతులు వాపోతున్నారు. పత్తి పంట సాగు చేస్తున్న తమకు ఏటా ఏదో ఒక రకంగా నష్టాలు వచ్చి అప్పులు మిగులుతున్నాయని రైతులు వాపోతున్నారు.

తెగుళ్ల బెడద..

పత్తి పంటకు తెగుళ్ల బెడద ఎక్కువైంది. అటు అనావృష్టి ఇటు పంటకు తెగుళ్లు సోకడంతో పంటకు పిచికారీ, ఎరువులు వేసేందుకు రైతుల ఖర్చు పెరిగింది. పంట సాగుకు ఈసారి ఎన్నడూ లేని విధంగా పెట్టుబడి పెరిగినా దిగుబడి తగ్గిందని రైతులు వాపోతున్నారు. పత్తి పంటకు తెగుళ్లు సోకడంతో పత్తి పంటలో ఆకులు రాలిపోయి పత్తి కర్రలు ఎండిపోతున్నాయి. సకాలంలో కూలీలు దొరక్కపోవడంతో పత్తితీత పనులు ఆలస్యం కావడంతో పత్తి నేలరాలుతుంది. సాధారణంగా పత్తి ఎకరానికి 7 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. అయితే ఈ ఏడాది అనావృష్టితో పంట దెబ్బతింది. తెగుళ్లతో ఎకరానికి 4 క్వింటాళ్ల దిగుబడి కూడా రాలేదని రైతులు పేర్కొంటున్నారు.

భరోసానివ్వని మద్దతు ధర

ప్రభుత్వం పత్తి క్వింటాలుకు రూ.6 వేలకు పైగా మద్దతు ధర ప్రకటించింది. కానీ పత్తి పంట ఆశించిన స్థాయిలో దిగుబడి రాలేదు. దీంతో వ్యాపారులు ఊళ్లకు వెళ్లి పంటను కొనుగోలు చేస్తున్నారు. క్వింటాలు పత్తికి రూ.7 వేల వరకు చెల్లిస్తున్నారు. అయితే పత్తి పంటలో దిగుబడి సరిగా లేక ఎలాంటి ప్రయోజనం ఉండడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం పత్తి క్వింటాలుకు రూ.15 వేల ధర కల్పించి రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

దిగుబడి తగ్గింది

నేను మూడు ఎకరాల్లో పత్తి పంట వేశాను. కానీ ఈసారి పత్తి పంట ఆశించిన స్థాయిలో దిగుబడి రావడం లేదు. పంట సాగుకు చేతిలో డబ్బులు లేక అప్పులు చేసి పంట సాగు చేశాను. పత్తికి పూత, కాత వివరీతంగా ఉన్నా సకాలంలో వర్షాలు లేక పూత రాలిపోయింది. కాయలు సైజు పెరగలేదు. ఇంత తక్కువగా ఎప్పుడూ దిగుబడులు రాలేదు. ఇకపై మళ్లీ పత్తి సాగు చేయాలంటేనే భయం వేస్తోంది.

– రవి, రైతు, తలోడి

ఖర్చు పెరిగింది

నేను నాలుగు ఎకరాల్లో పత్తి పంట వేశాను. సుమారు రూ.లక్ష వరకు ఖర్చయ్యింది. ఇదివరకు పత్తి ఎక్కువ దిగుబడి వచ్చేది. కానీ ప్రస్తుతం నాకు మొత్తంగా 10 క్వింటాళ్ల దిగుబడి కూడా రావడం లేదు. ఈసారి పత్తి పంట దిగుబడి పూర్తిగా పడిపోయింది. దీంతో ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడుతున్నాం. పంట దిగుబడి ఆశించిన స్థాయిలో రాలేదు. పంట సాగుకు పెట్టిన పెట్టుబడులు మీదపడ్డాయి.

– శంకర్, యాపలగూడ

అటకెక్కిన 'అనుసంధానం'

- వ్యవసాయ పనులను ఈజీఎస్‌లో చేర్చాలని నీతిఆయోగ్ సూచన
- ఖర్చులో 75 శాతం ప్రభుత్వమే భరించేలా ప్రణాళిక
- ఇప్పటికీ కార్యరూపం దాల్చని వైనం
- పెరిగిన పెట్టుబడులతో రైతులకు ఇబ్బందులు

వ్యవసాయాన్ని ఉపాధిహామీ పథకంలో అనుసంధానం చేయాలని ఏళ్లుగా రైతుల నుంచి డిమాండ్ ఉన్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. 2016లోనే వ్యవసాయాన్ని ఉపాధిహామీలో అనుసంధానం చేయాలని కేంద్ర ప్రభుత్వానికి నీతి అయోగ్ సూచించింది. అయినా ఇంతవరకు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు.

కెరమెరి: వ్యవసాయ పనుల భారం నానాటికీ పెరుగుతోంది. పంటలు సాగు చేయాలంటే రైతులకు కష్టతరంగా మారింది. కూలీల కొరతతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. 2016లోనే వ్యవసాయాన్ని ఉపాధిహామీ పథకానికి అనుసంధానం చేయాలని నీతి అయోగ్ సూచించింది. 75 శాతం ప్రభుత్వం, 25 శాతం రైతులు వ్యయాన్ని భరించేలా ప్రణాళికలు రూపొందించారు. కానీ నేటికీ ఎలాంటి కార్యచరణ చేపట్టలేదు. మండలంలో 7235 జాబ్ కార్డులు ఉండగా, 15,230 మంది కూలీలు వివిధ పనులు చేస్తున్నారు. ప్రస్తుతం రోడ్లకిరువైపులా మొక్కలు తొలగించడం, పొలాల్లో ఫిష్‌పాండ్‌లు, ఫారంపాండ్‌లు, చిన్ననీటి కుంటల నిర్మాణం వంటి పనులు చేస్తున్నారు.

22వేల ఎకరాల్లో పత్తి సాగు

మండలంలో మొత్తం 31 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఇందులో 6400 మంది రైతులు ఉన్నారు. 29,980 ఎకరాల్లో పంటలు పండిస్తుండగా, 22వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నారు. కంది 6వేలు, జొన్న 300, పెసర 300, మొక్కజొన్న 150, కూరగాయలు 630 ఎకరాల్లో పండిస్తున్నారు. పత్తి విత్తనాలు విత్తే నాటి నుంచి పంట చేతికొచ్చే వరకు ఎకరాకు రూ.10వేల నుంచి రూ.15వేల వరకు ఖర్చు చేస్తున్నారు. అయితే పత్తికి అనుకున్న రీతిలో మద్దతు ధర లేకపోవడంతో ఖర్చు తడిసి మోపెడవుతుంది. అరక దున్నేందుకు, ఎరువులు చల్లేందుకు, కలుపు తీసేందుకు, మందు పిచికారీ చేసేందుకు, పత్తితీతకు కూలీలకు చెల్లిస్తున్న ఖర్చులు ఎక్కువగా ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదు.



గోయగాంలో కొనసాగుతున్న ఈజీఎస్ పనులు

ఖర్చులు తగ్గుతాయి



నీతి ఆయోగ్ సూచించిన విధంగా కేంద్ర ప్రభుత్వం వ్యవసాయాన్ని ఉపాధిహామీ పథకంలో చేర్చాలి. అలా చేస్తే కూలీలకు ఇచ్చే ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుంది. దీంతో రైతులకు కేంద్ర ప్రభుత్వం ఎంతో కొంత సాయం చేసినట్లు అవుతుంది.

– సెండే సకారాం, బారేమోడి

కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంబరాలు

రెబ్బెన: కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తెలంగాణ రాష్ట్ర నూతన సీఎంగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని ఎంపిక చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సంబరాలు చేసుకున్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద టపాసులు కాల్చి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నినాదాలు చేశారు. నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి తిరిగి పూర్వవైభవం తీసుకురావడంతో పాటు రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చేందుకు రేవంత్ చేసిన కృషికి సరైన గుర్తింపు లభించిందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్, నాయకులు సుదర్శన్‌గౌడ్, చిరంజీవిగౌడ్, వెంకటేశ్వర్‌గౌడ్, బొంగు నర్సింగరావు, గోపి, మండల తిరుపతి, సురేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

ఎమ్మెల్యే హరీశ్‌బాబుకు సన్మానం

కాగజ్‌నగర్‌రూరల్: నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబును మంగళవారం ఎక్స్‌సర్వీస్‌మెన్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. పూష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ పదాధికారులు శివ, ఎంఏ నయీం, రాబిన్ హల్దార్, అనిల్ కుమార్, మనోజ్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



సన్మానిస్తున్న ఎక్స్‌సర్వీస్‌మెన్ అసోసియేషన్ సభ్యులు

హనుమాన్ ఆలయంలో కార్తీక వన భోజనాలు

ఆసిఫాబాద్‌అర్బన్: పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు వనభోజనాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో అర్చకులు ఒజ్జల శిరీష్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, ఉసిరిక వృక్షానికి పూజలు నిర్వహించారు. అనంతరం ఉదయం 10 గంటలకు సామూహిక వనభోజనాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు పిన్నా వివేక్, రూప్‌నార్ రమేశ్, ఎకిరాల శ్రీనివాస్, ఉదయ్, రమేశ్, భక్తులు పాల్గొన్నారు.



కార్తీక వన భోజనాలు చేస్తున్న భక్తులు

13 నుంచి గీతా జయంతి ఉత్సవాలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

శ్రీరాంపూర్: ఈ నెల 13 నుంచి 23వ తేదీ వరకు గీతా జయంతి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు శ్రీమత్ భగవద్గీత సత్సంగ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గురూజీ దాసరి రాజేశం తెలిపారు. శ్రీరాంపూర్‌లోని కృష్ణ కాలనీ శివాలయం ప్రాంగణంలోని గీతా ప్రశాంతి నిలయంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆలయ రజితోత్సవ కార్యక్రమంలో భాగంగా నిత్యం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 13నుంచి మొదలై 23వరకు జరుగుతాయన్నారు. 13నుంచి 19వరకు గీతా జ్ఞాన సప్తాహం, 20న భక్తుల కోలాటాలు, భజనలతో పురవీధుల్లో శోభాయాత్ర, 21న శ్రీమూర్తులతో లక్ష్మీ పూజలు, 22న గీతాహవన యజ్ఞాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి ప్రసాద్ రావుతోపాటు రాజమౌళి, లక్ష్మీనారాయణ, ఆరు మల్లేష్, ఎం.సారయ్య, సమ్మయ్య, మనోహర్ లక్ష్మీ, పద్మ పాల్గొన్నారు.

రైతులకు అవగాహన

చెన్నూర్‌రూరల్: వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో మండలంలోని ఒత్కులపల్లి గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఈవో సాగర్ పరిశీలించారు. తుపాను ప్రభావంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు అవగాహన కల్పించారు. అలాగే వరి, పత్తి పంటల్లో పాటించాల్సిన నాణ్యతా ప్రమాణాలపై తెలియజేశారు.

హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు

భీమారం: చెన్నూరు ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి వివేక్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించినందుకు మంగళవారం మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో కాంగ్రెస్ నాయకులు 516కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. తమ కోరిక తీర్చినందుకు ప్రత్యేక పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నట్లు జెడ్పీటీసీ బుక్యా తిరుమల తెలిపారు. ఇందులో జిల్లా కాంగ్రెస్ నాయకులు పొడేటి రవి, బుక్యా లక్ష్మణ్, కొమ్ము శ్రీనివాస్ పాల్గొన్నారు.

మేదరిపేటలో సంబరాలు

దండేపల్లి: తెలంగాణ రాష్ట్ర రెండో ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డిని ప్రకటించడంతో పలువురు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. దండేపల్లి మండలం మేదరిపేటలో మాజీ జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ మర్రి ప్రవీణారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబురాలు జరుపుకొన్నారు.

ఖాళీగా కంపోస్టు షెడ్లు..!



ఒడ్డుగూడలోని సెగ్రిగేషన్ షెడ్డు

- వర్మీ కంపోస్టు ఎరువు తయారేది..?
- నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

దహెగాం: ప్రతీ గ్రామ పంచాయతీలో డంపింగ్ యార్డుల్లో కంపోస్ట్ ఎరువు తయారు చేయాలనే లక్ష్యంతో నిర్మించిన షెడ్లు నిరుపయోగంగా మారాయి. మండలంలో 24 గ్రామ పంచాయతీలలో 24 కంపోస్ట్ షెడ్లు నిర్మించారు. ప్రతీరోజు గ్రామాల్లో సేకరించిన చెత్తను కంపోస్టు షెడ్లకు తరలించి తడి, పొడి చెత్తను వేరుచేసి ఎరువు తయారు చేయాల్సి ఉండగా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. వర్మీ కంపోస్ట్ తయారు చేయకపోవడం వల్ల ప్రభుత్వ లక్ష్యం నీరు గారిపోతోంది. కొన్ని పంచాయతీల్లో చెత్తను సేకరించడం లేదన్న ఆరోపణలూ ఉన్నాయి.


మొదట్లో వర్మీ కంపోస్టు తయారీ..

గ్రామాల్లో చెత్తను తడి, పొడిగా సేకరించి తడి చెత్తతో కంపోస్ట్ ఎరువు తయారు చేసేలా కంపోస్ట్ షెడ్లు నిర్మించారు. మండలంలో ఆరు పంచాయతీలలో మాత్రమే ఎరువు తయారు చేస్తుండగా మిగతా పంచాయతీలలో పేరుకే ఎరువు తయారు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కంపోస్టు షెడ్లు నిర్మించిన మొదట్లో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతీ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులకు వర్మీ కంపోస్ట్ తయారీపై ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. కాగా మండలంలోని మొట్లగూడ, రాంపూర్, దిగిడ, కల్వాడ, కుంచవెల్లి, పీపీరావు కాలనీ, కోత్మీర్ గ్రామాల్లోని కంపోస్టు షెడ్లలో వర్మీ కంపోస్ట్ తయారు చేసి నర్సరీలకు వినియోగిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

డంపింగ్‌యార్డుల నిర్వహణ కరువు..

మండలంలో డంపింగ్ యార్డుల నిర్వహణ సరిగా లేదని మండలవాసులు వాపోతున్నారు. గ్రామాల్లో రోజూ చెత్త సేకరణ చేపట్టడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో ఇంటి పరిసరాల్లో జమ చేసిన చెత్తను కాల్చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వర్మీ కంపోస్ట్ ఎరువుల తయారీకి చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పంట కోత ప్రయోగం



ప్రయోగం నిర్వహిస్తున్న ఏఈవో, రైతులు

నెన్నెల: మండలంలోని కోణంపేట గ్రామ శివారులో మంగళవారం వరిలో పంటకోత ప్రయోగం నిర్వహించినట్లు ఏఈఓ రాంచందర్ తెలిపారు. ఈ ప్రయోగం ద్వారా గ్రామ సాధారణ దిగుబడి అంచనా వేయొచ్చన్నారు. అంచనా వేసిన వివరాలను జిల్లా గణాంకాల అధికారికి పంపించనున్నట్లు తెలిపారు. వరి సరాసరి దిగుబడి నిర్ధారణకు ప్రభుత్వం ఏటా ఈ ప్రయోగాలు కొనసాగిస్తుందని ఏఈఓ వివరించారు. వరి పంట నష్టపరిహారాల చెల్లింపునకు పంట దిగుబడులను పసిగట్టేందుకు ఈ ప్రయోగాలు ఎంతగానో ఉపయోగపడుతాయన్నారు.

నేల సంరక్షణపై అవగాహన ర్యాలీ

ఆసిఫాబాద్‌అర్బన్: నేల విలువను తెలుసుకొని దానిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని ఏఈవో చిరంజీవి తెలిపారు. మంగళవారం మండలంలోని తుంపల్లి గ్రామంలో వాసన్ సంస్థ నిర్వహించిన ప్రపంచ మృత్తిక దినోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ నేలలో సారం పెరగాలంటే వందల సంవత్సరాలు పడుతుందని, అలాంటి నేలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. ప్రస్తుతం వాడుతున్న రసాయన ఎరువులతో భూసారం తగ్గుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంస్థ సిబ్బంది జయవర్ధన్, తిరుపతి, భీంరావ్, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ తీస్తున్న అధికారులు

బాధిత కుటుంబానికి పరామర్శ

బెజ్జూర్: మండలంలోని ఎల్కపల్లి గ్రామానికి చెందిన చటారి నారాయణ అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న బీజేపీ నాయకులు మంగళవారం ఆయన మృతదేహానికి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు ఆదేశాల మేరకు బాధిత కుటుంబాన్ని అన్నివిధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సామల తిరుపతి, రాజు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న బీజేపీ నాయకులు

8న అయ్యప్ప మండల పడిపూజ

శ్రీరాంపూర్: ఈ నెల 8న శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలోని అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి మండల పడిపూజ కార్యక్రమం జరగనుందని స్వాములు తెలిపారు. మంగళవారం దీనికి సంబంధించిన పోస్టర్‌ను శ్రీరాంపూర్ కార్యాలయంలో జీఎం సంజీవరెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రచార సభ ఏరియా అధ్యక్షుడు బొడ్డు లక్ష్మణ్ మాట్లాడుతూ.. కేరళకు చెందిన సంజీవనం బూద్రి గురుస్వామి ఆధ్వర్యంలో సాయంత్రం 6గంటలకు పడిపూజ కార్యక్రమం జరుగుతుందన్నారు. అనంతరం స్వాములతో అగ్ని గుండాల ప్రవేశ కార్యక్రమం కూడా ఉంటుందన్నారు. మధ్యాహ్నం స్వాములకు బిక్ష కార్యక్రమం కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి భక్తులు, స్వాములు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరారు. కార్యక్రమంలో ప్రచార సభ ఏరియా ప్రధాన కార్యదర్శి భాస్కర్ రాజేశం, ఉపాధ్యక్షులు మెడవేణి చందర్, వంగ శివకుమార్‌తో పాటు సురేందర్, ఐలయ్య హరీష్, శ్రావణ్, పుట్ట, రవి, ప్రసాద్, రమేష్, సిద్ధార్థ, దాసరి నవీన్, వేణు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జీఎం సంజీవరెడ్డి

విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

కాసిపేట: మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్, అన్ని యాజమాన్యాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాఠశాలలోని విద్యార్థుల వివరాలు, పాఠశాలలకు కావాల్సిన సౌకర్యాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ సూచించారు. మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్‌స్కూల్లో మంగళవారం మండల స్థాయి యూడైస్ ప్లేస్ పై ప్రధానోపాధ్యాయులకు అవగాహన కల్పించారు. వివరాల ఆధారంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, యూనిఫాంలు, ఇతర సౌకర్యాల మంజూరు ఉంటుందన్నారు. సమావేశంలో మండల నోడల్ అధికారి లచ్చయ్య, జెడ్పీ పాఠశాలల హెచ్‌ఎంలు సాంబమూర్తి, రమేష్ రాథోడ్, సుధాకర్, సీసీవో రాంబాబు మండలంలోని ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.